క్లుప్తంగా

పాఠశాలలకు జగనన్న విద్యాకానుక



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పంపిన విద్యా కానుకను తెనాలిలోని స్టాక్ పాయింట్ నుంచి మండల పరిధిలోని పాఠశాలలకు శుక్రవారం వాహనాల్లో తరలించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు విద్యాకానుకకు సంబంధించిన వస్తువులను కొత్తపేటలోని మున్సిపల్ బాలురోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌కు ఇటీవల పంపిన విషయం తెలిసిందే. వారి ఆదేశాల మేరకు వస్తువులను ప్రత్యేక వాహనాల్లో మొదటి విడత పట్టణంలోని మున్సిపల్ ఎలిమెంటరీ, హైస్కూళ్లకు పంపారు. రెండు రోజుల నుంచి మండల పరిధిలోని ఎలిమెంటరీ, హైస్కూళ్లకు వస్తువులను పంపారు. వీటిని కిట్‌లుగా తయారు చేసి ఈ నెల 12న విద్యార్థులకు అందజేయనున్నారు.

మలేరియా అవగాహన ర్యాలీ




తెనాలిఅర్బన్: దోమకాటు నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గంగానమ్మపేటలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ వట్టిప్రోలు మౌనిక కుమార్ పేర్కొన్నారు. మలేరియా, ఫైలేరియా విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం గంగానమ్మపేటలో మలేరియా మాసోత్సవ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమకాటు వలన అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. వాటి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, అసిస్టెంట్ మలేరియా అధికారి వంగాల పున్నారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సదా స్మరణీయుడు బొల్లిముంత శివరామకృష్ణ



తెనాలి: సమాజ చైతన్యం కోసం కమ్యూనిస్టు ఉద్యమం, అభ్యుదయ సాహిత్య రచనతో విశేషంగా కృషిచేసిన నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు, అభ్యుదయ సినీరచయిత బొల్లిముంత శివరామకృష్ణను సదా స్మరించుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి, తెనాలి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం రూరల్ మండలం కొలెవరంలో బొల్లిముంత శివరామకృష్ణ 19వ వర్ధంతి సభను నిర్వహించారు. ఉపాధ్యాయ ఉద్యమ నేత కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహించారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి దేవరపల్లి నీలాంబరం, డాక్టర్ పి.యోహాను, రంగిశెట్టి రమేష్ బెల్లంకొండ వెంకట్, కంచర్ల ఏడుకొండలు, కంచర్ల చంద్రశేఖర్, కంచర్ల నాగభూషణం మాట్లాడారు. తొలుత బొల్లిముంత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. నీలాంబరం పర్యవేక్షించారు.

మానసిక వ్యాధులపై అవగాహన ఉండాలి



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మానసిక వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి జిల్లా మానసిక వైద్య నిపుణులు సిహెచ్.మంజీర, డాక్టర్ తిరుమల బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల 2వ శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. వైద్యాధికారులు డాక్టర్ ఎం. ఇన్నారావు, డాక్టర్ ఎం.కృపా, స్టాఫ్ నర్సర్ శ్రీమతి శ్రావణి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ బహూకరణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు దాత సహకారంతో శుక్రవారం నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. ఏడుకొండలు మాట్లాడుతూ ఈమని పాఠశాల పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మాట్లాడుతూ విద్యార్థులు అందరూ కష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలని, కార్యక్రమంలో దాత చుండూరు భాస్కరరావు, ఉపాధ్యాయుడు సూరగాని ప్రకాశరావు, అధ్యాపకులు ఎం. సురేష్ కుమార్, కె.డేవిడ్, జేవీ సుబ్బారావు, సిహెచ్.లక్ష్మీకుమార్, ఎస్. ప్రకాశరావు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కట్టుబడి

నాడు-నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు

- మొదటి, రెండో విడత కింద తెనాలి పట్టణంలో 42 పాఠశాలల ఎంపిక
- పాఠశాలల ఆధునికీకరణకు రూ.13 కోట్ల నిధులు కేటాయింపు
- విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఏర్పాటు



కార్పొరేట్‌కు దీటుగా : నాడు-నేడు కింద ఆధునికీకరించిన ఇందిరానగర్ కాలనీలోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్



భవితకు బంగారు కానుక: తెనాలి చేరిన విద్యాకానుక కిట్‌లోని వస్తువులు

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మారటంతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను వాటిలో కల్పించారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న చిన్నచూపును సైతం సీఎం జగన్ విద్యాశాఖలో తీసుకువచ్చిన నూతన సంస్కరణల ద్వారా తుడిచివేశారు. అందరూ ప్రభుత్వ పాఠశాలల వైపు చూసే విధంగా చేయటంతో పాటు కార్పొరేట్ పాఠశాలలకే పరిమితం అయిన ఇంగ్లిష్ మీడియంను పేద విద్యార్థులకు చేరువచేసి అందరి మన్ననలను ప్రభుత్వం పొందుతోంది.

పదివేలమంది వరకు 'ప్రభుత్వ' విద్యార్థులు..

తెనాలి పట్టణంలో మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్స్ 38, ఎయిడెడ్ పాఠశాలలు-7, హైస్కూల్స్-6, ఎయిడెడ్- 2 ఉన్నాయి. వీటిలో సుమారు పది వేల మంది వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు అమ్మ ఒడి, విద్యార్థులకు జగనన్న విద్యా కానుక, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలను ప్రవేశపెట్టారు.

సుమారు 15 వేల మందికి లబ్ధి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాల ద్వారా తెనాలి పట్టణంలో సుమారు 15వేల మందికి పైగా లబ్ధి చేకూరుతుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే వీటిని ప్రవేశపెట్టి అమలు చేశారు. తల్లిదండ్రులపై చదువుల భారాన్ని ప్రభుత్వం తగ్గించడంతో పాటు దాదాపు అన్ని పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం విద్యాబోధన ప్రవేశపెట్టారు. దీంతో పేద విద్యార్థులు సైతం ఇంగ్లిష్ పట్ల ఆసక్తి చూపుతూ, నేర్చుకుంటున్నారు. వారిలో కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచేందుకు ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేసింది. దీంతో పట్టణంలోని ఎనిమిదో తరగతి చదువుతున్న సుమారు 1000 మంది విద్యార్థులకు ఇవి ఎంతో ప్రయోజనకరంగా మారాయి.

ఆధునిక సొబగులు ..

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు నాడు-నేడు పథకాన్ని ప్రవేశపెట్టారు. తెనాలి పట్టణంలో నాడు-నేడు మొదటి విడత కింద 22 పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో అదనపు గదుల నిర్మాణం, ఫ్లోరింగ్, ఫ్యాన్లు, టాయిలెట్స్, వాటర్ ప్లాంట్, ఆధునిక బెంచ్‌లు వంటి వాటిని ఏర్పాటు చేశారు. అందుకు గాను మొదటి విడత కింద రూ.4.06కోట్ల నిధులను వెచ్చించారు. అంతేకాకుండా రెండో విడత కింద మొత్తం 20స్కూళ్లను ఎంపిక చేసి వాటిని ఆధునికీకరించేందుకు రూ.8.43కోట్ల నిధులను వెచ్చించారు. ప్రస్తుతం రెండో విడత పనులు జరుగుతున్నాయి. మొత్తం మీద రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో తీసుకువచ్చిన సంస్కరణల వలన పేద ప్రజలకు నాణ్యమైన విద్య అందుతుందని చెప్పవచ్చు.



స్వచ్ఛం.. శుభ్రం: ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడరన్ టాయిలెట్స్

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు అమ్మ ఒడి పథకం ద్వారా ఆర్థిక చేయూతను కల్పిస్తున్నారు. అంతేకాకుండా కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమైన ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. సీఎం జగన్ మేనమామల వ్యవహరిస్తూ మా బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

–షేక్ మొహిద్దీన్ పర్వీన్, విద్యార్థి తల్లి

పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయి..



గతంలో ఇరుకు గదుల్లో, చాలీచాలని మరుగుదొడ్లతో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అంతేకాకుండా మధ్యాహ్న భోజనం కూడా అంత నాణ్యతగా ఉండేది కాదు. జగన్ మామయ్య అధికారంలోకి వచ్చిన తరువాత మాకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయడంతో పాటు మంచి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అలాగే ట్యాబ్‌లను కూడా అందించి సాంకేతికతను పెంపొందింపజేశారు.

– ఎం.సాయికిరణ్, 9వ తరగతి విద్యార్థి

పెరిగిన విద్యార్థుల సంఖ్య



రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో తీసుకువచ్చిన సంస్కరణల ద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులు సంఖ్య, ఉత్తీర్ణత శాతం పెరిగింది. గతంలో పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలంటే కొన్ని సంవత్సరాలు పట్టేది. నాడు-నేడు ద్వారా నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వమే కల్పిస్తూ విద్యార్థుల ఉన్నతికి పాటుపడుతుంది.

– షేక్ అహ్మద్ హుస్సేన్, ఉర్దూ స్కూల్ హెచ్ఎం

వైద్యశాల నుంచి రోగి అదృశ్యం

తెనాలిరూరల్: తెనాలి జిల్లా వైద్యశాల నుంచి రోగి అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన గోల్డ్ వర్కర్ వల్లభాపురపు మాధవకృష్ణ గత నెల 27వ తేదీన ఎలుకల మందు తిన్నాడు. గమనించిన కుటుంబసభ్యులు పట్టణ నెహ్రూ రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ నుంచి గురువారం తెనాలి జిల్లా వైద్యశాలకు వచ్చి చేరాడు. శుక్రవారం వైద్యశాల నుంచి కనడబకుండా పోయాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు.

వేగవంతంగా పైపులైన్ మరమ్మతులు

ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడులో ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మురుగునీటి పారుదలకు పైపులైన్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు నియోజకవర్గ పార్టీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌కు విన్నవించారు. స్పందించిన సురేష్‌కుమార్ పనులు నిర్వహించేందుకు సొంత నిధులు కేటాయించి ఆదేశాలు ఇవ్వడంతో కొద్దిరోజులుగా గ్రామంలో ప్రధాన వీధులకు ఇరువైపులా పైపులైను ఏర్పాటు చేసేందుకు వీలుగా పొక్లెయిన్‌తో పనులు నిర్వహిస్తున్నారు. పనులను పార్టీ గ్రామ అధ్యక్షుడు శనగల నాగిరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

రూ.5 లక్షల అపరాధ రుసుం వసూలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవార ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ అక్కల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళగిరి పట్టణంలో విద్యుత్ చౌర్యం, ఇతర విషయాలపై జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో మొత్తం 2,686 సర్వీస్‌లను పరిశీలించగా, 101 మంది విద్యుత్ వినియోగదారులు అధిక లోడ్ వినియోగించడం, పలుచోట్ల చౌర్యం చేయడం గుర్తించి, వీరి నుంచి అపరాధ రుసుం కింద రూ.5,54,550 వసూలు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌డీపీ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ప్రత్తిపాటి విజయకుమార్, కె.వి.యల్.ఎన్.మూర్తి, డీపీఈ కె.వి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పంట వ్యర్థాలను తగలబెట్టవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్

తెనాలిటౌన్: రైతులు తమ పొలాల్లో ఉన్న మొక్కజొన్న, జొన్న దంటులను తగులబెట్ట వద్దని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ కోరారు. పర్యావరణానికి హానీ కలిగించవద్దని, పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. రూరల్ మండలం కొలకలూరులోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మండల రైతు సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ ఆర్‌బీకేలో ఉన్న పరికరాలను ఇతర రైతులకు బాడుగకు ఇవ్వాలని, ప్రతి ఆర్‌బీకేలో మట్టి నమూనా సేకరించాలని సూచించారు. డ్రోన్ పరికరాలు కావాల్సిన వారు ఆర్‌బీకేలో అధికారులను సంప్రదించాలని కోరారు. కౌలు రైతు కార్డులు, వీఆర్ఓ ద్వారా ఎక్కువ మంది కౌలు రైతులకు ఇచ్చేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలను 50శాతం సబ్సిడీపై సరఫరా చేస్తున్నట్లు ఏఓ తెలిపారు. సమావేశంలో ఆర్బీకేల వ్యవసాయ సహాయకులు నాగరాజు, గోపినాథ్, సొసైటీ చైర్‌పర్సన్ గంపల వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు అంచె రోశయ్య, వేజండ్ల రాధాకృష్ణమూర్తి, తాడిబోయిన యలమంద, తులాబంధుల శివనాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం



గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

మున్నంగి(తెనాలిరూరల్): మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెల తొమ్మిదో తేదీన నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ యోజన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండల పరిధిలోని గర్భిణులు అందరికీ రక్తహీనతను నివారించేందుకు పోషకాహార విలువలు కలిగిన రాగిపిండి, ఆకుకూరలను దుగ్గిరాలకు చెందిన చుండూరు భాస్కరరావు సహకారంతో వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీసుధ మాట్లాడుతూ గర్భిణుల్లో రక్తహీనతను నివారిస్తే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వవచ్చని తెలిపారు. గర్భిణులకు ఉచితంగా హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, యూరిన్, ఆల్బుమిన్ షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమాజ ఆరోగ్య అధికారిణి దాసరి స్వరూపరాణి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, వంగర బుజ్జిబాబు, తుమ్మ నాగరాజు, హెల్త్ విజిటర్ దమ్ము ఆశీర్వాదమ్మ, భాగ్యలక్ష్మి, స్టాఫ్ నర్స్ అన్నపూర్ణ, హెల్త్ అసిస్టెంట్ గంగవరపు శ్రీనివాసరావు, రాచకొండ నాగమల్లేశ్వరరావు, మున్నంగి, వల్లభాపురం ఏఎన్ఎంలు కుసుమ, నాగ యామిని, శ్యామ్ జ్యోతి, ఆశా కార్యకర్తలు సాయి శకుంతల, అరుణ, షేక్ మస్తాన్, బి.శ్రావణి పాల్గొన్నారు.

కేఎల్‌యూ ఎన్‌సీసీ క్యాడెట్లకు అవార్డులు



ఎన్‌సీసీ క్యాడెట్ సాత్వికను అభినందిస్తున్న కల్నల్ పి.ఎస్. సిద్ధూ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్ విశ్వవిద్యాలయానికి చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు బెస్ట్ క్యాడెట్ అవార్డు అందుకున్నారని హాబీక్లబ్ ఇన్‌చార్జి సుభాకర్ రాజు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ 25వ ఎన్‌సీసీ బెటాలియన్ గత నెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వార్షిక శిక్షణ శిబిరంలో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పి.ఎస్. సిద్ధూ చేతుల మీదుగా బెస్ట్ క్యాడెట్ అవార్డును అందుకున్నారని అన్నారు. శిక్షణ సమయంలో టెంట్ పిచ్చింగ్‌లో సాత్విక, డ్రిల్‌లో ప్రణీతలు ప్రథమ స్థానంలో నిలిచి ఉత్తమ క్యాడెట్ అవార్డులను అందుకున్నారని అన్నారు. క్యాడెట్లను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, డీన్ యొక్క సలహాదారులు డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, సాక్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య అభినందించారు.

నేడు,రేపు గ్రూప్-2 సిలబస్‌పై అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ గ్రూప్-2 సిలబస్‌లో మార్పులపై రాష్ట్రస్థాయి ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జయం స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.రాజకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి రోడ్డులో భారత్‌పేట ఒకటో లైనులోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు 10 సబ్జెక్టుల్లో పది మంది అధ్యాపకులతో పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి జయం స్టడీ సర్కిల్ యాప్‌ను ఆవిష్కరిస్తారని తెలిపారు. గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 63094 93634 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా పరిపాలన అందిస్తున్నానని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామంలో శుక్రవారం నాలుగో రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందన తెలుసుకోవడంతో పాటు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానికంగా ఉన్న గ్రామంలోని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ తీసుకువెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల వివరాలను తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. సంగం జాగర్లమూడి గ్రామంలో గత మూడున్నరేళ్లలో రూ. 11.80కోట్ల సంక్షేమ ఫలాన్ని గ్రామస్తులకు డీబీటీ పద్ధతిలో నేరుగా అందించినట్లు తెలిపారు. 227 కుటుంబాలకు వైఎస్సార్ కాపు నేస్తం అందుతోందని, 800 మందికి పైగా పెన్షన్‌లు అందిస్తున్నామని చెప్పారు. 161 మందికి నివేశన స్థలాలు కేటాయించామని, నాలుగు రోజుల్లో మరో 40 వరకు అర్జీలు వచ్చాయని వాటినీ పరిశీలించి త్వరలో స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. వైఎస్సార్ చేయూత 416 మందికి అందుతోందని వివరించారు. సంక్షేమంతో పాటు గ్రామ అభివృద్ధికీ పెద్దపీట వేస్తున్నామని చెబుతూ గత మూడున్నరేళ్లలో సంగం జాగర్లమూడిలో రూ. 3.50 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. నాడు-నేడు పథకం కింది గ్రామంలోని పాఠశాలలను రూ. రెండు కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. అర్హులైన ప్రజలకు సంక్షేమం పూర్తిస్థాయిలో అందిందా లేదా అన్న అంశాన్ని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తెలుసుకుంటున్నామని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యల ప్రస్తావనను నమోదు చేసుకుని రానున్న నాలుగు నెలల్లో పరిష్కరిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో 86 శాతం కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధి చేకూరుతోందని, ప్రభుత్వోద్యోగులు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు, పదెకరాలకు మించి పొలం ఉన్న వారికి మాత్రమే పథకాలు వర్తించట్లేదని చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, పాలడుగు సాంబశివరావు, రెడ్డి శ్రీనివాసరావు, నాగమోతు రామారావు, నాగమోతు శివనాగేశ్వరరావు, పాటంశెట్టి నాగరాజు, దేవిరెడ్డి పూర్ణయ్య, తోట శ్రీనివాసరావు, అక్కిదాసు కిరణకుమార్, కఠారి హరీష్, బూరెల దుర్గ, ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

చర్మకారులకు గొడుగులు పంపిణీ



చర్మకారులకు గొడుగులు పంపిణీ చేస్తున్న మంగళగిరి తహశీల్దార్ రామ్‌ప్రసాద్, వాసవి వనిత క్లబ్ సభ్యులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలో చర్మకార వృత్తిలో ఉన్న వారికి శుక్రవారం వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంగళగిరి తహసీల్దార్ రామ్ ప్రసాద్ చర్మకారులకు గొడుగులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎండలు చాలా తీవ్రంగా ఉన్నాయని, చర్మకారులు ముఖ్య కూడళ్లల్లో ఎటువంటి నీడ లేకుండా చెప్పులు కుడుతున్నారని, రాబోయేది వర్షాకాలమని వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని సేవా దృక్పథంతో వాసవి వనిత క్లబ్ నిర్వాహకులు దేవతి భగవాన్ నారాయణ ఈ గొడుగులను అందజేయడం ఎంతో అభినందించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో సెక్రటరి గాయత్రి, శ్రేష్టి గోపాలకృష్ణ, ఎస్.కుమార్, బొల్లా రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుతో అధిక దిగుబడి

ఫిరంగిపురం: పచ్చిరొట్ట ఎరువులతో అధికదిగుబడి సాధించవచ్చని ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహామండలి చైర్మన్ డి.బుచ్చిరెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహామండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పైరు సాగుకు ముందుగా రైతన్నలు తప్పనిసరిగా పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవాలని చెప్పారు. రైతులందరు పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రతి ఏటా ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతులకు 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు జనుములు, జీలుగలు, పిల్లిపెసర విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జి.చంద్రం, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీఓ డి.అనూరాధ పాల్గొన్నారు.

నేడు సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డు అన్నదాన సమాజం ఆడిటోరియంలో శనివారం సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు మునిపల్లె రమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎన్టీఆర్, ఏఎన్ఆర్ నటించిన చిత్రాల్లోని పాటల్ని గాయకులు ఆలపిస్తారని పేర్కొన్నారు.

తాగి వాహనం నడిపినందుకు జరిమానా

గుంటూరు లీగల్: తాగి వాహనం నడిపిన వ్యక్తికి గుంటూరు ఆరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కొల్లి శృతవింద శుక్రవారం రూ.10 వేలు జరిమానా విధించారు. గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 6వ తేదీన ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు గుంటూరు వన్‌టౌన్ పరిధిలోని నందివెలుగు రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఆ సమయంలో పాత గుంటూరుకు చెందిన షేక్ జానీబాషా మద్యం తాగి బైక్ నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడ్ని శుక్రవారం కోర్టుకు హాజరు పర్చగా తన నేరాన్ని అంగీకరించాడు. దీంతో న్యాయమూర్తి నెల రోజులు జైలు లేదా రూ. 10 వేలు జరిమానా కట్టాలని తీర్పు చెప్పారు. దీంతో నిందితుడు రూ.10 వేలు జరిమానా చెల్లించాడు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

పాత గుంటూరు: అమరావతి రోడ్డు ఆంజనేయపేటలో పురాతన శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. బద్దిగం కోటిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకులు పూజలు నిర్వహించి మహా ద్వారం నిలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు సహాయ, సహకారాలు అందించాలని కోటిరెడ్డి కోరారు. కార్యక్రమంలో వంగల వలి వీరారెడ్డి, పులగం శివారెడ్డి, ముప్పా చంద్రశేఖరరెడ్డి, కారసాని బాబుల్‌రెడ్డి, కత్తి వీరారెడ్డి, రాఘవయ్య పాల్గొన్నారు.